# అర్హులందరికీ రూ.500లకే గ్యాస్

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ప్రాసీడింగ్స్ అందజేత

గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

వికారాబాద్, అక్టోబర్ 25: అర్హులందరికీ రూ.500లకే గ్యాస్ అందిస్తామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మహాలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్స్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఊరూరా తిరుగుతూ హామీలు ఇచ్చామన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తపన ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఐదేండ్లలో నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పిస్తామన్నారు. గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను తొలగించేందుకు సీఎంతో కలిసి కృషి చేస్తామన్నారు.

**పేదలందరికీ సొంత ఇండ్లు**

రాష్ట్రంలో పేదలకు సొంత ఇంటిని కల్పించడానికి ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పీకర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3600 ఇండ్లను మంజూరు చేశామన్నారు. స్పీకర్ నియోజకవర్గం కావడంతో వికారాబాద్‌కు ఏడు వేల ఇండ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలియజేశారని ఆయన అన్నారు. ఈ నిధులతో చెరువులను అభివృద్ధి చేసుకుందామన్నారు. బ్యాంకు తప్పిదాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, డిసెంబర్ 9 నాటికి అర్హులందరికీ రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జాఫర్, అంజయ్య, మోహన్ తదితరులు ఉన్నారు.

## బడ్జెట్ లేక.. పథకాల అమలులో ఆలస్యం

ఆసరా పింఛన్లు, మహిళలకు రూ.2500 తదితర పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ అన్నారు. బడ్జెట్ లేని కారణంగా పథకాల అమలులో ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గంలోనూ రూ. 170 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వికారాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేస్తామన్నారు. ఉడా ఏర్పాటుతో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 493 గ్రామాల్లో సమగ్రమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు సమకూర్చడానికి నిధులు మంజూరవుతాయని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఉంటుందన్నారు. కొత్త పరిశ్రమలు వస్తాయన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే

షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, అక్టోబర్ 25: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మహబూబ్‌నగర్ జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా షాద్‌నగర్‌లో స్వాగతం చెప్పామని ఎమ్మెల్యే తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. వీర్లపల్లి శంకర్‌కు ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ పదవి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అగ్గనూరు విశ్వం, చేగూరి రాజేందర్ రెడ్డి, చెన్నయ్య, దంగు శ్రీనివాస్‌యాదవ్, కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

కడ్తాల్, అక్టోబర్ 25: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఏసీపీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులు, కేసు ఫైల్స్‌ను పరిశీలించారు. నేరస్తులు, రౌడీ షీటర్ల సమాచారంపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని పోలీసులకు సూచించారు. పోలీసులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అనుమతుల్లేకుండా పటాకులు విక్రయించే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజే బాక్స్‌లు సరఫరా చేసే వారు పోలీసుల అనుమతులు పొందాలని తెలిపారు. ఫంక్షన్ హాలులు, రిసార్ట్‌లో అనుమతి లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడవలు సృష్టించే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదేండ్లకోసారి పశు గణన

పశు గణన చేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

చేవెళ్లటౌన్, అక్టోబర్ 25: ఐదేండ్లకోసారి పశు గణన చేస్తామని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కురుమ కాలనీలో 21వ పశు గణనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్లలోని కురుమ వాడలోని కుటుంబ సభ్యులను కలిసి పశు గణన చేశామని తెలిపారు. ఈ ప్రక్రియ నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ గణనతో దేశంలో ఎన్ని ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, నాటుకోళ్లు, ఇతర జంతువులు ఉన్నాయో అని తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ దేవేందర్ రెడ్డి, ఆలూర్ పశువైద్యాధికారి మోహన్ రెడ్డి, పశు కాపరులు తదితరులు ఉన్నారు.

# చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు

**గ్రామంలో విచారణ చేపట్టిన డీఎల్‌పీవో సాధన**

పంచాయతీ కార్యదర్శిని విచారిస్తున్న డీఎల్‌పీవో సాధన

యాచారం, అక్టోబర్ 25: మండలంలోని చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు పడింది. ఆస్తి ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని గ్రామానికి చెందిన ముక్కెరి మధుసూదన్ పంచాయతీ కార్యాలయంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఈ విషయమై ఇబ్రహీంపట్నం డీఎల్‌పీవో సాధన శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నెలకొన్న ఘటనపై, పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలపై శుక్రవారం ఆమె విచారణ చేపట్టారు. అధికారులు, గ్రామస్తులతో కలిసి జరిగిన విషయమై పంచాయతీ కార్యాలయంలో ఆరా తీశారు. కార్యదర్శి జ్యోత్స్నపై వచ్చిన ఆరోపణలపై గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు.

**దురుసుగా వ్యవహరించేది..**

ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పట్ల పంచాయతీ కార్యదర్శి దురుసుగా వ్యవహరించేదని కొంత మంది గ్రామస్తులు డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి రూ.60వేలు డిమాండ్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయనే ప్రశ్నకు ఆధారాలు చూయించాలని డీఎల్‌పీవో బదులిచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శితో పాటు ఇటు బాధితుడి తరఫున ఆమె స్టేట్‌మెంట్ తీసుకున్నారు. గ్రామస్తులు కొందరు పంచాయతీ కార్యదర్శికి వ్యతిరేకంగా వివరణ ఇచ్చారు. ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించామన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపిస్తామని ఆమె తెలిపారు. డీపీవో ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఆమెను పంచాయతీ విధులకు దూరంగా ఉంచుతున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు. చౌదర్‌పల్లికి ఇన్‌చార్జి కార్యదర్శిగా గున్‌గల్ పంచాయతీ కార్యదర్శి శోభారాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

**నిబంధనల మేరకు విధుల నిర్వహణ**

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నను వివరణ కోరగా పంచాయతీ రాజ్ నియమ నిబంధనల మేరకు విధులు నిర్వహించానని తెలిపారు. మధుసూదన్ ఇంటి స్థలం కొలతలు చేసిన తర్వాత సెట్ బ్యాక్ తీసేసి ధ్రువీకరణ పత్రం ఇస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఆయన మాత్రం ఉన్న పూర్తి స్థలానికి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అందుకు అంగీకరించకపోవడంతో పురుగుల మందు తాగి నన్ను భయపెట్టాడన్నారు. ఎవరినీ డబ్బులు అడుగలేదని, ఇందుకు సంబంధించి నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా సిద్ధమని ఆమె తెలిపింది. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారిణి శ్రీలత ఉన్నారు.

# ఐదో రోజు సజావుగా గ్రూప్-1 పరీక్షలు

కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ గౌతంకుమార్

మొయినాబాద్, అక్టోబర్ 25: గ్రూప్-1 పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఉన్న విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 984 మంది అభ్యర్థులకు 579 మంది పరీక్షలకు హాజరయ్యారు. చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 1200 మందికి 706 మంది పరీక్షలు రాశారు. అమ్డాపూర్ చౌరస్తాలో ఉన్న జోగిన్‌పల్లి భాస్కర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 816 మందికి 445 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. కేజీరెడ్డి కళాశాలలో, జోగిన్‌పల్లి భాస్కర ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాలను మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణ పర్యవేక్షించారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

# పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గ్రామంలో పర్యటిస్తున్న రంగారెడ్డి డీపీవో సురేశ్‌మోహన్

షాబాద్, అక్టోబర్ 25: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలో మురుగు కాల్వలు, తాగునీటి ట్యాంకులు, బోరు మోటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుధ్యంపై ప్రజలకు ఎప్పటికప్పుడూ అవగాహన కల్పించాలని సూచించారు. మురుగు కాల్వల వద్ద, తాగునీటి ట్యాంకుల వద్ద పారిశుధ్యం లోపించకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలని తెలిపారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలకు నీరుపోసి సంరక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ అమరేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అమరవీరుల కుటుంబాలకు అండగా ఉందాం

- ఎస్పీ నారాయణరెడ్డి
- కొనసాగుతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
- కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ, 3కే రన్

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 25: పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు అందరూ అండగా ఉండాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అనంతగిరి చెక్‌పోస్టు నుంచి హరిత రిసార్ట్స్ వరకు సైకిల్, 3కే రన్ నిర్వహించారు. వీటిని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని యువకులు, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, శిక్షణ కానిస్టేబుళ్లు 450 మంది వరకు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ సైకిల్ ర్యాలీ, 3కే రన్ నిర్వహించామన్నారు. ప్రతి ఏడాది దేశ అంతర్గత భద్రతను కాపాడుతూవీరమరణం పొందిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించామని తెలిపారు. పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ వారిని గౌరవించుకుందామన్నారు. ర్యాలీలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, యువకులు, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తశ్వర్‌అలీ, గోవర్ధన్‌రెడ్డి, హఫీజ్, సతీశ్, నారాయణ, మాణిక్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పంచాయతీ అవార్డు రేసులో కోకట్

గ్రామ అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శిని అడిగి వివరాలు తెలుసుకొంటున్న రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కమిషనర్ రవీందర్, వెస్లే

యాలాల, అక్టోబర్ 25: నేషనల్ పంచాయతీ అవార్డుకు వికారాబాద్ జిల్లా నుంచి కోకట్ గ్రామ పంచాయతీ ఎంపిక కావడంతో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కమిషనర్ రవీందర్, వెస్లీలు గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, మహిళా స్వయం సహాయక బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం గ్రామ అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను అడిగి వివరాలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సంధ్యారాణి, డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్ నాయక్, ఎంపీడీవో పుష్పలీల, ఎంపీవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రక్తదానం శిబిరంలో ఎస్పీతో పాటు పోలీసు అధికారులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లాలోని యువకులు, శిక్షణ పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. యువతీయువకులు రక్తదానం చేసేందుకు ముందు కు రావాలని పిలుపునిచ్చారు. అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. వారు చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు అధికారులతో పాటు ప్రిన్సిపాల్ మురళీధర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ సాయి చౌదరి, వైస్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, కోశాధికారి జీడీ నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాలల సత్తా చూపిస్తాం

- ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- మాలల జనాభా నిష్పత్తి ఎంతో ప్రభుత్వం తేల్చాలి
- తక్కువ జనాభా అంటూ దుష్ప్రచారం
- కులగణన చేయకుండా వర్గీకరిస్తే ధర్మయుద్ధం తప్పదు
- సమతా భవన్‌లో మాల సంఘాల సమావేశంలో నేతల హెచ్చరిక

జిల్లెలగూడ గాయత్రీనగర్‌లోని సమతా భవనంలో మాల సంఘాల నేతల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

బడంగ్‌పేట, అక్టోబర్ 25: మాలల సత్తా ఏమిటో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలకు రుచి చూపిస్తామని విశ్రాంత శాస్త్రవేత్త రాజేశ్వర్‌రావు అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ గాయత్రీ నగర్ సమతా భవనంలో మాల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మాలల జనాభా తక్కువంటూ దుష్ప్రచారం చేస్తే తరిమికొడతామని ఆయన హెచ్చరించారు. తప్పుడు ప్రచారం మానుకోవాలని అన్నారు. నవంబర్ 10న ఎస్సీ వర్గీకరణనను నిరసిస్తూ నగరంలో సభను ఏర్పాటు చేస్తామన్నారు. మాలల ఐక్య సంఘటన కమిటీ పిలుపు మేరకు సభను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. మాలల జనాభా నిష్పత్తిని తేల్చిన తర్వాతే వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. 30 ఏండ్ల కిందటి లెక్కలను ఎలా పరిగణలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. ప్రస్తుతం మాలల స్థితిగతులపై అధ్యయనం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ అంశంలో పక్షపాతం లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరుతున్నామని తెలిపారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే మహార్ సైన్యం స్ఫూర్తిగా మాలలు ధర్మయుద్ధం చేయడం ఖాయమని హెచ్చరించారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీలో ప్రతి మాల భాగస్వామి కావాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జల రాంచందర్, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, చవ్వ శ్రావన్‌కుమార్, యంగల యాదగిరి, రాజలింగం, నర్సింగ్‌రావు, కోటేశ్వర్‌రావు, మేకల పాండు, సూరి బాబు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# వచ్చే నెల 7న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక..

ఆదిబట్ల, అక్టోబర్ 25 : రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 7న రంగారెడ్డి జిల్లాకు వస్తున్నదని కలెక్టర్ శశాంక శుక్రవారం తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, ఉమ్మడి జిల్లాకు సంబంధించి కలెక్టరేట్‌లో 7న ఉదయం 10 గంటల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభిప్రాయాలు తెలియ జేయాలనుకునే వారు రాత పూర్వకం ఇవ్వవచ్చని, లేదా అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చన్నారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్ధేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలు, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని కలెక్టర్ సూచించారు.

# మా ప్లాట్లు ఇప్పించండి సారూ..



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న బాధితులు

వికారాబాద్, అక్టోబర్ 25: మా ప్లాట్లు మాకు ఇప్పించాలని వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట కొంత మంది బాధితులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మోమిన్‌పేట మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ సమీపంలోని 86 సర్వే నంబర్లలో వెంచర్‌లో 150 మందికి ప్లాట్లు ఉన్నాయన్నారు. ఈ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు మా ప్లాట్లను కబ్జా చేశారన్నారు. మా ప్లాట్లను మాకు తిరిగి ఇప్పించాలని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారు మనోహర్, ఎండీ ఆదిల్, రాజేశ్ శ్రావణ్, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

సురేశ్ గుప్తాకు నియామక పత్రాన్ని అందజేస్తున్న అమరవాది లక్ష్మీనారాయణ, చింతల రవికుమార్ తదితరులు

వనస్థలిపురం, అక్టోబర్ 25: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా గందే సరేశ్ గుప్తా ఎన్నికయ్యారు. శుక్రవారం వనస్థలిపురంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కమిటీ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవాది మాట్లాడుతూ.. వ్యాపారంతోపాటు విద్యా, రాజకీయ రంగాల్లో కూడా ముందుకు సాగాలన్నారు. వైశ్యులకు అన్ని పార్టీలు తగిన రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గణేశ్‌గుప్తా, మహాసభ పొలిటికల్ చైర్మన్ చింతల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి అర్థం లక్ష్మయ్య, బిళ్లకంటి కిరణ్, రవీందర్, శంకర్, రంగయ్య, జయరాములు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.